అష్టలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న అహోబిల రామానుజ జీయర్ స్వామి

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ వాసవి కాలనీలోని అష్టలక్ష్మి ఆలయంలో ఆదివారం అహోబిల రామానుజ జీయర్ స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. కార్యక్రమంలో అష్టలక్ష్మి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాధ్యతలు తీసుకున్న నాగోలు కొత్త సీఐ



సీఐ పరుశురాం

నాగోలు: నాగోలు పోలీసు స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పి.పరశురాం ఆదివారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ సీఐగా విధులు నిర్వహించిన వెంకటేశ్వర్లు ఇటీవల స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ కాగా, ఆయన స్థానంలో స్పెషల్ బ్రాంచ్ నుంచి పరశురాం వచ్చారు. నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన పరశురాంను నాగోల్ డివిజన్ బీఆర్‌ఎస్ నాయకుడు సతీష్ యాదవ్‌తో పాటు పలువురు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

మరాఠా కమ్యూనిటీహాల్ ప్రారంభం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల

మలక్‌పేట: మరాఠాల సమస్యల పరిష్కారానికి మజ్లిస్ పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. అక్బర్‌బాగ్ డివిజన్ పల్టాన్‌లో రూ.9.90 లక్షల జీహెచ్‌ఎంసీలోని ఎమ్మెల్యే నిధులతో నిర్మించిన మరాఠా కమ్యూనిటీ హాల్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, పార్టీలకు అతీతంగా అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తామన్నారు. కార్పొరేటర్ సయ్యద్ మినాజుద్దీన్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నిర్దిష్ట ప్రణాళికలతో అభివృద్ధి పనులు

మన్సూరాబాద్: నిర్దిష్టమైన ప్రణాళికలతో డివిజన్‌లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలో రూ.1.92 కోట్లతో చేపడుతున్న వరదనీటి కాలువ పనులను ఆదివారం సెంట్రల్ బ్యాంక్ కాలనీలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తకుండా చంద్రపురి కాలనీలోని రోడ్ నం.5 నుంచి సెంట్రల్ బ్యాంక్ కాలనీ మీదుగా కాకతీయ స్కూల్ వరకు వరద నీటి కాలువ నిర్మాణ పనులు చేపడుతున్నామన్నారు. నాయకులు కదారి యాదగిరి యాదవ్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

'వికసిత్ భారత్'లో కేంద్ర పథకాలపై అవగాహన

మలక్‌పేట: కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి అన్నారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా ఆదివారం శాలివాహననగర్ పార్కులో కేంద్ర పథకాల సింగిల్ విండో కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముద్రలోన్, పీఎం ఉజ్వల్ యోజన, ఆధార్ మార్పులు, చేర్పులు, పీఎం ఆవాజ్ యోజన, పీఎం స్వయం నిధి యోజన, జీవనజ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన తదితర పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అధికారులతో కలిసి కార్పొరేటర్ వికసిత్ భారత్ వాల్ పోస్టర్ విడుదల చేశారు. కోఆర్డినేటర్ కిషన్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రణీత్, ఆధార్ ఇన్‌చార్జి నజీర్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలి

- టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి

మన్సూరాబాద్: 118 జీఓపై సీఎంను కలిసి చర్చిస్తానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అనడం విడ్డూరంగా ఉందని, ముఖ్యమంత్రిని కలిసే ముందు ఎల్‌బీనగర్ ప్రజలకు ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలని టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మన్సూరాబాద్ సెంట్రల్ బ్యాంక్ కాలనీలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మునుగోడు ఉప ఎన్నికల సమయంలో ఆగమేఘాలపై 118 జీఓ తీసుకువచ్చి ఎల్‌బీనగర్ ప్రజలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మోసగించారని ఆరోపించారు. ఆ జీఓతో 12 వేల కుటుంబాలను అభాసుపాల్జేశారని మండిపడ్డారు. సుధీర్‌రెడ్డి సీఎంను కలుస్తానని అనడం 118 జీఓ మోసపూరితమైనదని ఒప్పుకున్నట్టే కదా అని అన్నారు. 118 జీఓను రద్దు చేసి రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వేగవంతం చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిందని, ఆ హామీ అమలు చేసే బాధ్యతను పార్టీ తీసుకుంటుందని స్పష్టం చేశారు. సమావేశంలో నాయకులు రాజశేఖర్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, పుల్లయ్య, ఆంజనేయులు, క్లైం సుజాతరెడ్డి, భవానీ, సరస్వతి, జైపాల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలను పోలీసులను చేశారు!

- ఉచితంగా కోచింగ్ ఇచ్చిన సార్‌కు సత్కారం



కోచ్ రామన్‌ను సత్కరిస్తున్న ఉద్యోగం సాధించిన అభ్యర్థులు

నాగోలు: పేదలకు ఉచితంగా ఎస్‌ఐ , కానిస్టేబుల్ కోచింగ్ అందించి ఏడుగురు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికయ్యేందుకు తోడ్పాటు అందించిన ఫిజికల్ కోచ్‌ను ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు ఆదివారం సత్కరించారు. నాగోలు డివిజన్ జైపురికాలనీలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బండ్లగూడ మహావీర్ వనస్థలి పార్కులో ఈ కార్యక్రమం జరిగింది. బండ్లగూడలోని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జీఎస్‌ఐ)లో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గా పని చేస్తున్న రామన్(54) ఎస్‌ఐ, కానిస్టేబుల్స్ ఉద్యోగ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుపేద అభ్యర్థులకు హరిణ వనస్థలి పార్కులో గత కొంత కాలంగా ఫిజికల్ ఫిట్నెస్ అంశంలో ఉచితంగా కోచింగ్ ఇస్తున్నాడు. ఈయన వద్ద శిక్షణ పొందిన నాగోలు జైపురికాలనీకి చెందిన వారిలో ఒకరు ఎస్‌ఐ, ఏడుగురు కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. వీరంతా ఆదివారం కోచ్ రామన్ దంపతులను సన్మానించారు. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేలా తమను తీర్చిదిద్దిన రామన్ సార్‌కు తాము జీవితాంతం ఋణపడి ఉంటామని అన్నారు. ఇప్పుడు మరో బ్యాచ్‌కు కోచింగ్ ప్రారంభించామని, ఆసక్తి ఉన్నవారు వచ్చి చేరవచ్చని కోచ్ రామన్ అన్నారు. ఆర్గనైజర్ లక్ష్మణ్, ప్రమోద్‌గౌడ్, విద్యాసాగర్, భాస్కర్ రెడ్డి, శాలిని, సిద్దల ఐలయ్య పాల్గొన్నారు.

వామ్మో.. విషవాయువులు!

- అటవీ శాఖ స్థలంలోకి పారిశ్రామిక వ్యర్థాలు
- యథేచ్ఛగా జంతు కళేబరాల డంపింగ్
- రసాయన వ్యర్థాలతో ఎండిపోయిన చెట్లు
- ఎగసి వస్తున్న దుర్వాసన
- కలుషితమవుతున్న భూగర్భజలాలు
- వ్యాధుల బారిన జనం



ఆటోనగర్‌లోని అటవీశాఖ స్థలంలోకి చేరిన పారిశ్రామికవాడ రసాయనాలు

మన్సూరాబాద్: పచ్చదనంతో ఆహ్లాదకరంగా ఉండాల్సిన అటవీ శాఖ స్థలంలోకి పారిశ్రామిక, రసాయన వ్యర్థాలు చేరాయి. ఫలితంగా అక్కడి పచ్చని చెట్లు ఎండిపోయి ఆ ప్రాంతం ఎడారిని తలపిస్తోంది. అంతేగాక అక్కడి నుంచి వెలువడుతున్న విషవాయువుల కారణంగా సమీప కాలనీల ప్రజలు శ్వాస సంబంధ వ్యాధుల బారిన పడుతున్నారు. రసాయనాల వల్ల భూగర్భజలాలు కలుషితమై బోర్ల నుంచి కలుషిత నీరు రావడంతో వాటిని వినియోగిస్తున్న జనం చర్మ సంబంధ వ్యాధులకు గురవుతున్నారు. అటవీ ప్రాంతంలో పారిశ్రామిక వ్యర్థాలు డంప్ చేయకుండా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, అటవీ, టీఎస్‌ఐఐసీ అధికారులు చర్యలు తీసుకోవాలని హరిణి వనస్థలి జాతీయ పార్కు సమీప కాలనీల ప్రజలు కోరుతున్నారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇవీ...

- ఒకప్పుడు నగర చెత్తనంతా ఆటోనగర్‌లో డంపింగ్ చేసి అతి పెద్ద డంపింగ్ యార్డ్‌గా మార్చారు. సమీప కాలనీల వాసులు జేఏసీగా ఏర్పడి నాటి ప్రతిపక్షనాయకుడు వైఎస్ రాజశేఖరరెడ్డిని ఈ ప్రాంతానికి తీసుకువచ్చి పరిస్థితిని వివరించారు. వైఎస్సార్ సీఎం కాగానే స్థానికులకు ఇచ్చిన హామీ మేరకు డంపింగ్‌యార్డ్‌ను ఈ ప్రాంతం నుంచి తరలించారు. దీంతో సమీప ప్రాంతాల్లో కాలనీలు వేగంగా అభివృద్ధి చెందాయి. అయితే, గత కొంత కాలంగా కాలనీలవాసులు రసాయన వ్యర్థాలు, విషవాయువుల కారణంగా వ్యాధుల బారిన పడుతున్నారు.
- నగరంలో మృతి చెందిన జంతువుల కళేబరాలను చెత్త డంపింగ్‌యార్డ్ ప్రాంతంలో గుంత తీసి పూడ్చి వేసేందుకు జీహెచ్‌ఎంసీ నుంచి కాంట్రాక్ట్ దక్కించుకున్న కాంట్రాక్టర్ జంతువుల కళేబరాలను వాహనంలో తీసుకువచ్చి డంపింగ్ యార్డ్ ప్రాంతంలో పడేసిపోతున్నాడు. ఆ కళేబరాలు కుళ్లిపోయి తీవ్ర దుర్వాసన వెదజల్లుతున్నాయి.
- ఆటోనగర్ పారిశ్రామికవాడలోని రసాయన వ్యర్థాలు ఇక్కడి అటవీశాఖ స్థలంలోకి వచ్చి చేరుతోంది. దీంతో ఆ ప్రాంతంలో నుంచి సమీపంలోకి కాలనీలకు విపరీతమైన దుర్వాసన వస్తోంది.
- గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి సమయంలో ట్యాంకర్లలో రసాయన వ్యర్థాలను తీసుకువచ్చి గుట్టుచప్పుడు కాకుండా ఇక్కడ విడిచిపోతున్నారు.
- కేబీఆర్ కన్వెన్షన్ నుంచి డంపింగ్‌యార్డ్ రోడ్డు వెంట భవన నిర్మాణ వ్యర్థాలు, చికెన్, మటన్ దుకాణాల్లోని వ్యర్థాలను రాత్రి సమయంలో వాహనాల్లో తీసుకొచ్చి పడేసిపోతున్నారు. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

తీవ్ర దుర్వాసన వస్తోంది



ఆటోనగర్ పారిశ్రామికవాడలోని రసాయన పరిశ్రమల నుంచి రసాయన వ్యర్థాలు హరిణి వనస్థలి జాతీయ పార్కు ఆధీనంలోని స్థలంలోకి చేరి తీవ్ర దుర్వాసన వస్తోంది. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కాలుష్య నియంత్రణ అధికారులు, టీఎస్‌ఐఐసీ, అటవీశాఖ అధికారులతో పలుమార్లు చర్చలు జరిపి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. అయితే, సమస్య తీరిందని అనుకుంటే కొద్ది రోజుల నుంచి మళ్లీ విషవాయువులు వెలువడుతున్నాయి.

– కత్తుల రాంబాబు, సెవెన్‌హిల్స్ కాలనీ

అసాంఘిక శక్తులకు అడ్డాగా..



చెత్త డంపింగ్‌యార్డ్ రోడ్డు అసాంఘిక శక్తులకు అడ్డాగా మారింది. ఇతర ప్రాంతాలను యువత ఈ ప్రాంతానికి గంజాయి సేవిస్తున్నారు. ప్రశ్నిస్తే దాడులకు పాల్పడుతున్నారు. అధికారులు నిఘా పెంచాలి. నగరంలోని చికెన్, మటన్ షాపుల్లోని వ్యర్థాలు, ఆసుపత్రి వ్యర్థాలను రాత్రి సమయంలో ఇక్కడికి తెచ్చి కాల్చివేస్తున్నారు. దీంతో విషవాయువులు వెలువడి చర్మ, శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నాం.అధికారులు స్పందించి కఠిన చర్యలు చేపట్టాలి.

– సంతోష్‌గుప్తా, హిమపురి కాలనీవాసి

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

దిల్‌సుఖ్‌నగర్: అందరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని చిత్ర లేఅవుట్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెండ్యాల నగేష్ అన్నారు. ఆదివారం ఆర్‌కేపురం డివిజన్ చిత్ర లేఅవుట్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో టెనెట్ డయాగ్నోస్టిక్స్ సహకారంతో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో ఉచితంగా థైరాయిడ్, కొలెస్ట్రాల్, బీపీ ఇతర రక్త పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో చిత్ర లేఅవుట్ కాలనీ సంక్షేమ సంఘం నాయకులు సత్యనారాయణరెడ్డి, సుధాకర్‌రెడ్డి, గోదా కృష్ణారెడ్డి, యాదగిరిరావు, టెనెట్ ప్రతినిధులు శ్రీకాంత్, రమేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా దర్శనం పవన్



పవన్‌కు నియామకపత్రం అందజేస్తున్న డీసీసీ అధ్యక్షుడు

సైదాబాద్: హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా దర్శనం పవన్ నియమితులయ్యారు. ఈ మేరకు హైదరాబాద్ డీసీసీ అధ్యక్షుడు మహ్మద్ వలీఉల్లా సమీర్ ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదివారం దర్శనం పవన్ సైదాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. జిల్లా పరిధిలో పార్టీ పటిష్టతకు కృషి చేస్తానన్నారు. తనకు జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శిగా అవకాశం ఇచ్చిన జిల్లా అధ్యక్షుడు వలీఉల్లా సమీర్‌కు పవన్ కృతజ్ఞతలు తెలిపారు.

ముఖ్యమంత్రి సహాయ నిధితో పేదలకు లబ్ధి : ఎమ్మెల్యే



లబ్ధిదారు కుమారుడికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

నాగోలు: ముఖ్యమంత్రి సహాయ నిధితో ఎంతో మంది పేదలకు లబ్ధి చేకూరుతున్నదని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. నాగోల్ డివిజన్ పరిధిలోని లలితానగర్‌కు చెందిన లావణ్య వెన్నెముఖ సమస్యతో బాధపడుతోంది. ఆపరేషన్ చేయించేందుకు తమ ఆర్థికపరిస్థితి బాగా లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని సంప్రదించారు. దీంతో ఆయన ఆపరేషన్‌కు అవసరమైన డబ్బుల వివరాలతో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేయించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి లవణ్య ఆపరేషన్ కోసం రూ. 1.50 లక్షల ఎల్‌ఓసీ చెక్కు మంజూరైంది. దానిని ఆదివారం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి లబ్ధిదారు కుమారుడు విష్ణుప్రసాద్‌కు అందజేశారు. కార్యక్రమంలో నాగోల్,'హస్తినాపురం డివిజన్ల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు చిరంజీవి, సత్యం చారి తదితరులు పాల్గొన్నారు.

పేద యువతి పెళ్లికి ఐవీఎఫ్ చేయూత

నాగోలు: పేదలకు అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) చేయూత నందిస్తుందని అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. మహబూబాబాద్ జిల్లా విస్సంపల్లి గ్రామానికి చెందిన నిరుపేదలు శాగంటి శ్రీను, నాగమ్మ తమ కుమార్తె సౌజన్య వివాహం సందర్భంగా ఆదివారం నాగోలుకు వచ్చి ఉప్పల శ్రీనివాస్‌గుప్తాను కలిశారు. ఐవీఎఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో ఉప్పల శ్రీనివాస్ గుప్తా వారి కుమార్తె పెళ్లి కోసం మంగళ సూత్రం, మెట్టెలు,చీర, గాజులు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఐవీఎఫ్ అడిషనల్ జనరల్ సెక్రెటరీ కటకం శ్రీనివాస్, బీఆర్‌ఎస్ పార్టీ నాయకురాలు వరలక్ష్మి తదితరులు ఉన్నారు.

లక్ష్యాల సాధనకు పట్టుదలతో శ్రమించాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కరస్పాండెంట్

సైదాబాద్: విద్యార్థులు ఉన్నత ఆశయాలను లక్ష్యాలుగా చేసుకొని వాటిని సాధించడానికి పట్టుదలతో శ్రమించాలని ప్రముఖ సాఫ్ట్‌వేర్ నిపుణుడు లింగిడి శ్రీకాంత్ సూచించారు. చంపాపేటలోని శ్రీత్రివేణి ఉన్నత పాఠశాల 36వ వార్షిక దినోత్సవ వేడుకలు స్థానిక ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన లింగిడి శ్రీకాంత్ మాట్లాడుతూ, చిన్ననాటి నుంచే విద్యార్థులకు వారికి ఆసక్తి గల అంశంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తగిన ప్రోత్సాహం, శిక్షణ ఇస్తే ఆయా రంగాల్లో ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని అన్నారు. పాఠశాల కరస్పాండెంట్ కె.గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ, వివిధ రంగాలలో స్థిరపడిన తమ పాఠశాల పూర్వ విద్యార్థులు పాఠశాలలో నిర్వహించే ప్రతీ కార్యక్రమంలో పాల్గొని సందడి చేయడం సంతృప్తిని ఇస్తోందన్నారు. గతేడాది 10వ తరగతిలో 10 జీపీఏ సాధించిన ఐదుగురు విద్యార్థులకు పాఠశాల చైర్మన్ సురేందర్‌రెడ్డితో కలిసి రూ. 25 వేల పారితోషకాన్ని అందజేశారు. అలాగే, వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శారద, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జిల్లా కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధిగా వెంకటేష్ గౌడ్



వెంకటేష్‌గౌడ్‌కు నియామక పత్రం అందజేస్తున్న చల్లా నర్సింహారెడ్డి

నాగోలు: రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా లింగోజిగూడ డివిజన్‌కు చెందిన బొంగు వెంకటేష్ గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు అతడికి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి నియామక పత్రాన్ని ఆదివారం అందజేశారు. తనను అధికార ప్రతినిధిగా నియమించినందుకు వెంకటేష్ గౌడ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్‌గౌడ్, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్, జక్కిడి ప్రభాకర్ రెడ్డి, టీపీసీసీ ప్రచార కమిటీ కో-కన్వీనర్ వజీర్ ప్రకాష్ గౌడ్‌కు ప్రత్యేక ధన్యావాదాలు తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రచార కమిటీ కోఆర్డినేటర్ గౌని నరసింహ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'చలో నల్గొండ'ను విజయవంతం చేయాలి

సైదాబాద్: ప్రజా శ్రేయస్సు కోసమే బీఆర్‌ఎస్ ఎప్పుడూ పోరాడుతుందని ఐఎస్‌సదన్, సైదాబాద్ డివిజన్‌ల మాజీ కార్పొరేటర్లు సామ స్వప్న సుందర్‌రెడ్డి, సింగిరెడ్డి స్వర్ణలతా రెడ్డి అన్నారు. ఆదివారం రాష్ట్ర మాజీ హోంమంత్రి మహమూద్ అలీ బీఆర్‌ఎస్ నాయకులతో నిర్వహించిన పార్టీ సమీక్ష సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈనెల 13న నల్గొండలో రాష్ట్ర పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న భారీ బహిరంగసభపై వారు చర్చించారు. చలో నల్గొండ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని వారు కోరారు.

పార్కు అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయండి



నాగేశ్వర్‌రావు కాలనీలోని తెలంగాణ పార్కులో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: డివిజన్ పరిధిలోని నాగేశ్వర్‌రావు కాలనీలోని తెలంగాణ పార్కు పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ సూచించారు. ఆదివారం ఆయన తెలంగాణ పార్కులో కాలనీ వాసులతో కలిసి పర్యటించారు. పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పార్కులో వాకింగ్ ట్రాక్‌పై చెత్తాచెదారం పేరుకుపోయిందని, శుభ్రం చేయడానికి ఎవరు రావడం లేదని, దీంతో వాకింగ్ చేసేటప్పుడు తమకు ఇబ్బంది కలుగుతోందని కార్పొరేటర్‌కు చెప్పారు. వెంటనే స్పందించిన కార్పొరేటర్ శానిటేషన్ సూపర్‌వైజర్ చిరంజీవిని పిలిపించి ప్రతి రోజూ పార్కును శుభ్రం చేయించాలని, పార్కులో వ్యర్థాలను తొలగించాలని సూచించారు. పార్కులోని విద్యుత్ దీపాలు తదితర సమస్యలను పరిశీలించారు. పార్కులో అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని హెచ్‌ఎండీఏ అధికారులను కోరతానని కాలనీవాసులతో కార్పొరేటర్ అన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు రాంనాథ్ రెడ్డి, విజయ్ భాస్కర్, రాకేష్ యాదవ్, లక్ష్మీరాజం, నారాయణ, వెంకటేశ్వర్లు, రామాంజనేయులు, సోమన్న తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణానగర్ కాలనీ నూతన కార్యవర్గం

వనస్థలిపురం: డివిజన్ పరిధిలోని శ్రీకృష్ణానగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కుట్ల నర్సింహయాదవ్, ప్రధాన కార్యదర్శిగా నాగిళ్ల వెంకటేష్, కోశాధికారిగా ఈ.శ్రీనివాస్‌రెడ్డి, ముఖ్య సలహాదారులుగా పి.అంజయ్య, సి.సత్యం, ఎస్‌ఎల్‌వీఎస్ ప్రసాద్, టి.భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా జి.ఉపేందర్‌రెడ్డి, వి.యాదగిరిరావును ఎన్నుకున్నారు. అలాగే, సంయుక్త కార్యదర్శులుగా అంజయ్యయాదవ్, ఆశీష్‌రెడ్డి, ప్రదీప్‌గౌడ్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా బబ్లు పవర్, రాజు పవర్, కార్యవర్గసభ్యులుగా నరేందర్, కైలాస్,లక్ష్మీనారాయణ, కృష్ణారెడ్డి, కిషోర్, శశిధర్‌రెడ్డి ఎన్నికయ్యారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోండి



వైద్యశిబిరంలో మందులు అందజేస్తున్న శ్వేతామధుకర్‌రెడ్డి

సైదాబాద్: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పలు పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతా మధుకర్‌రెడ్డి సూచించారు. ఆదివారం వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర వాహనం డివిజన్ పరిధిలోని ఖాజాబాగ్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా వాహనానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక తెరపై కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పలు పథకాలను ప్రదర్శించి ప్రజలకు వివరించారు. పథకాల దరఖాస్తులను బస్తీవాసులకు అందజేశారు. ఆయుష్మాన్ భారత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరంలో పరీక్షలు చేసుకున్న వారికి కార్పొరేటర్ మందులు అందజేశారు. కార్యక్రమంలో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు గంగిరెడ్డి గిరిధర్‌రెడ్డి, ధీరజ్, అజయ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సీతారాం, మధుమతి తదితరులు పాల్గొన్నారు.

జీవితంలో వాకింగ్ భాగం కావాలి



ప్రమాణ స్వీకారోత్సవంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి

మలక్‌పేట: ప్రతి ఒక్కరి జీవితంలో వాకింగ్ భాగం కావాలని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి పిలుపు నిచ్చారు. డివిజన్‌లోని చిన్నపార్కులో ఆదివారం జరిగిన శాలివాహన వాకర్స్ క్లబ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్లబ్ అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. వాకింగ్ చేయడం వలన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందన్నారు. వాకర్స్ క్లబ్ జిల్లా గవర్నర్ వై. శ్రీనివాసాచారి కమిటీ అధ్యక్షుడు కె.నర్సింహారెడ్డి, కార్యదర్శి కమలాకర్, కోశాధికారి యాదయ్యయాదవ్, ఎగ్జిక్యూటీవ్ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రోగ్రామ్ ఆఫీసర్ గంగుల వెంకటేశ్వర్‌రెడ్డి, చక్రపాణి, జెక్కా మోహన్‌రెడ్డి, మాధవరావు, వంగాల ప్రవీణ్‌రెడ్డి, సత్యనారాయణ యాదవ్ పాల్గొన్నారు.

జలమండలి అధికారుల బస్తీబాట

- 'సాక్షి' కథనానికి స్పందించిన అధికారులు
- హరిజన బస్తీలో కలుషిత నీటి సమస్య పరిష్కారానికి చర్యలు
- మూడు ట్యాంకర్లతో బస్తీకి తాగునీరు సరఫరా


సాక్షి
జలం.. గరళం!

ఆదివారం 'సాక్షి' ప్రచురించిన కథనం



కాలం చెల్లిన తాగునీటి పైప్‌ను తొలగిస్తున్న జలమండలి సిబ్బంది

చంపాపేట: డివిజన్ పరిధిలోని కటకోనికుంట అంబేడ్కర్ విగ్రహ చౌరస్తా సమీపంలోని హరిజన బస్తీలో కలుషిత తాగు నీటి సరఫరా సమస్యపై 'జలం...గరళం' పేరిట ఆదివారం 'సాక్షి' ప్రచురించిన కథనానికి జలమండలి అధికారులు వెంటనే స్పందించారు.సిబ్బందిని తీసుకొని బస్తీకి వెళ్లి కలుషిత తాగునీటి సమస్యను ప్రత్యక్షంగా పరిశీలించారు. మూడు ట్యాంకర్లతో బస్తీకి తాగునీటిని రప్పించి స్థానికుల నీటి సమస్యకు తాత్కాలిక ఉపశమనం కలిగించారు. నీరు కలుషితమయ్యేందుకు అవకాశం ఉన్న పలు ప్రాంతాల్లో గుంతలు తవ్వి కాలం చెల్లిన తాగు నీటి పైప్‌లైన్ స్థానంలో కొత్త పైప్ ఏర్పాటు చేసేందుకు పనులు ప్రారంభించారు. సమస్య పరిష్కారం అయ్యేంత వరకు ప్రతీ రోజు కాలనీ వాసుల అవసరం మేరకు వాటర్ ట్యాంకర్లు పంపుతామని, నల్లాల నుంచి సరఫరా అయ్యే కలుషిత నీటిని కాలనీ వాసులు ఉపయోగించవద్దని వాటర్ వర్క్స్ మేనేజర్ రమ్యభారతి కోరారు. కలుషిత తాగునీటి సరఫరా సమస్యతో నెల రోజులుగా తాము ఇబ్బందులు పడుతున్నామని, తమ సమస్యపై ప్రత్యేక కథనం ప్రచురించి జలమండలి అధికారుల్లో చలనం కలిగించిన 'సాక్షి'కి హరిజన బస్తీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.